ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
కర్ణాటక వార్తలు
గురువారం 19 డిసెంబరు 2024



మారథాన్‌లో డోజీ బృందం

బెంగళూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వైట్‌ఫీల్డ్ కేటీపీఓ వద్ద ఇటీవల జరిగిన మిడ్‌నైట్ మారథాన్‌లో ప్రముఖ వైద్యసేవల సంస్థ డోజీ బృందం కూడా పాల్గొంది. డోజీ సంస్థ సీఈఓ, సహ సంస్థాపకులు ముదిత్ దండవతె వైర్ లెస్ సెన్సార్‌లను ధరించి పరుగులో పాల్గొన్నారు. తద్వారా వారి శారీరక స్థితిగతులు, వ్యాయామం గురించి ఎప్పటికప్పుడు సులభంగా తెలుసుకునేందుకు వీలైంది. రోగుల సంరక్షణలో ప్రత్యేక గుర్తింపు పొందిన డోజీ సంస్థ ఫిట్‌నెస్‌కోసం ఉద్దేశించిన మారథాన్‌లో సంస్థ ఉద్యోగులు పాల్గొని సత్తా చాటారు. 17వ ఎడిషన్ మారథాన్ ఉత్సాహంగా సాగిందని వారు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

కేఐఏడీబీ తీరుపై రైతుల నిరసన

బలవంతపు భూస్వాధీనం
తగదని ఆందోళన
సమస్య పరిష్కరించాలని
తహసీల్దార్‌కు వినతి



7లో

గ్రామీణ ప్రాంతాల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

8లో

తాలూకా పంచాయతీ
పాలనాధికారి మల్లికార్జున
విద్యాశాఖ పనితీరుపై అసంతృప్తి



సృజనాత్మకతను పెంచుకోవాలి

పీఈఎస్ ప్రొ చాన్స్‌లర్
జవహర్ దొరస్వామి పిలుపు
డిజైన్ షోకేస్-2024
ప్రారంభం



7లో

కోట్లు ఖర్చుపెట్టి సువర్ణసౌధకు వచ్చేది ఎందుకు..?

- పదిరోజులు మినహా ఏడాది పొడవునా భూత్ బంగళానే..
- మండిపడ్డ యత్నాళ్



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్

బెంగళూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తర కర్ణాటక ప్రాంత జిల్లాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో బెళగావి కేంద్రంగా సువర్ణసౌధ నిర్మించి స్థానిక సమస్యల పరిష్కారానికి ఉద్దేశించినప్పటికీ అమలు కావడం లేదని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఆక్రోశం వ్యక్తం చేశారు. బెళగావి సువర్ణసౌధలో శాసనసభ శీతాకాల సమావేశాలలో బుధవారం ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ మాట్లాడుతూ శాసనసభ సమావేశాల నిర్వహణకు కోట్లాది రూపాయలు ఖర్చు అవుతాయన్నారు. కృష్ణ జల భాగ్య ఎండీ ఇక్కడికి ట్రిప్‌కు వచ్చినట్టు వస్తారని, బెంగళూరులోని కార్యాలయాన్ని ఇక్కడికి మార్చడం లేదన్నారు. ఏడాదిలో పదిరోజులు మాత్రమే శాసనసభ కలాపాలు ఇక్కడ జరుగుతాయని మిగిలిన రోజులు ఇది భూత్‌బంగళాగా ఉంటోందంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు. విధానసౌధలో ఒక కేబినెట్ సమావేశం నిర్వహిస్తే మరో భేటీ బెళగావిలో నిర్వహించాలన్నారు. ఉత్తర కర్ణాటకకు నిరంతరం అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. గ్యారెంటీ పథకాలకు బదులు నీరావరి పథకాలు అమలు చేసి ఉంటే బాగుండేదన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులతో వేలాదిమంది ఉపాధి లభించి ఉండేదన్నారు. ఉత్తరకర్ణాటక ప్రాంతంలో ఎంతమంది మంత్రులు ఉన్నారో చూడండని ఎంబీ పాటిల్, ప్రియాంక ఖర్గే, శరణు ప్రకాశ్ మినహా ఎవరూ లేరన్నారు.

బెంగళూరులోనే రెండో అంతర్జాతీయ విమానాశ్రయం ఎందుకు..?

అంతర్జాతీయ విమానాశ్రయాలు రెండూ బెంగళూరు కేంద్రంగా ఎందుకని ప్రశ్నించారు. బెళగావిలోని విమానాశ్రయాన్ని కూడా అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చాలన్నారు. సాధ్యం కాకుంటే కలబురగిలోగానీ, విజయపురలో ఏర్పాటు చేయాలన్నారు. కాగా విజయపురలో నిర్మించిన ఎయిర్‌పోర్ట్ ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోస్టుకార్డు నుంచి... డిజిటల్ అరెస్టు దాకా..!

- సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన, అప్రమత్తత అవసరం
- ఏడాదిలో 641 కేసులు



బెంగళూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక యుగంలో ప్రపంచీకరణతో అరచేతిలోకి సమాచారం అందుతోంది. ఒకప్పుడు ప్రజలకు సమాచారం అందాలంటే పోస్టుకార్డులే శరణ్యం. స్వాతంత్య్రం వచ్చిన నాలుగైదు దశాబ్దాలవరకు గ్రామాలనుంచి నగరాల వరకు రహదారి సౌకర్యం అంతంత మాత్రంగా ఉండేది. ద్విచక్ర వాహనాలు, బస్సులు, వ్యాన్‌లు వంటివి ఉన్నా అవి పట్టణాలు, నగరాలకే పరిమితంగా ఉండేవి. గ్రామీణ ప్రాంతాల రాకపోకలకు మట్టి రోడ్లు, కాలిబాటలు ఉండేవి. ఇలాంటి తరుణంలో బంధుమిత్రుల సమాచారం తెలుసుకునేందుకు పోస్టుకార్డునే ఉపయోగించేవారు. ఎక్కువ విషయాలు ఉంటే ఇన్‌ల్యాండ్ లెటర్ వినియోగించేవారు. ఉభయకుశలోపరి అంటూ ఒకరికొకరు ఉత్తరాలు రాసుకుని పరిస్థితులను తెలుసుకునేవారు. ఒకప్పుడు రేడియో, ల్యాండ్‌లైన్ టెలిఫోన్ ఉండడం ఒక స్టేటస్ సింబల్‌గా ఉండేది. చాలా అత్యవసరమైతే తప్ప ల్యాండ్ ఫోన్‌కు కూడా ఫోన్‌లు చేసేవారు కాదు.

● కంప్యూటర్‌లు అందుబాటులోకి వచ్చి నాలుగైదు దశాబ్దాలైనా ఆరంభంలో వాటిని వాడాలంటే భయపడేవారు. క్రమేపీ ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది. అనంతరం మొబైల్ ఫోన్‌లలో కూడా ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. బేసిక్ నుంచి అంచెలంచెలుగా 2జీ, 3జీ, 4జీ, 5జీ జనరేషన్ వంటివి అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు ఒక వ్యక్తి క్షేమ సమాచారం తెలుసుకోవాలంటే ఉత్తరాలే శరణ్యంగా ఉండేది. మరి ఇప్పుడో ఎంత దూరంలో ఉన్నాసరే స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు వీడియోకాల్ చేసేంతగా టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది.

● సాంకేతిక ప్రయోజనంతో ఇంటర్నెట్ ప్రయోజనాలు ఎంతగా పెరిగాయో వీటిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్ళు చెలరేగిపోతున్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే దాదాపు అంతమంది స్మార్ట్‌ఫోన్‌లు వాడుతున్నారు. కుటుంబీకులు ఎవరైనా కొద్దిసేపు స్విచ్చాఫ్ చేసినా, లేదా అవుట్ ఆఫ్ కవరేజ్ వచ్చినా ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది.

● డిజిటల్ అరెస్టు అంటూ బెదిరింపులు

ఇటీవలికాలంలో శ్రీమంతులైన యువత మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారు. ధనవంతులు, డ్రగ్స్‌కు అలవాటైనవారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు 'మీరు పంపిన' లేదా మీ 'పేరిట వచ్చిన పార్శిల్'లో మాదకద్రవ్యాలు ఉన్నాయి, కేసునుంచి బయటపడాలంటే భారీగా చెల్లించాలని ఏకంగా కొంతమంది అధికారుల వేషంలో నకిలీ అధికారులు వీడియోకాల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ప్రత్యేకించి కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఇన్‌కమ్‌ట్యాక్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ వంటి అధికారులుగా చెప్పి మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటూ బెదిరింపులు చేస్తున్నారు. ఇటీవలికాలంలో ఇలాంటి సంఘటనలతో దేశవ్యాప్తంగా ప్రజలు కోట్లాదిరూపాయలు పోగొట్టుకున్నారు. కొడుకో, కూతురు లేదా కుటుంబీకుల పేర్లు చెప్పి బెదిరించడం ద్వారా మరో ఆలోచనకు అవకాశం లేకుండా చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురై సైబర్ నేరగాళ్లు చెప్పినంత మొత్తాన్ని వారికి సమర్పించుకుంటున్నారు.

● సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

కేంద్ర దర్యాప్తు సంస్థలైనప్పటికీ డిజిటల్ అరెస్టు చేసే అవకాశం లేదని, ఫోన్‌కాల్స్‌లో వాస్తవం ఎంత ఉందో తెలుసుకుని అప్రమత్తంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. ఏమాత్రం కంగారుపడినా, ఏమరుపాటుగా ఉన్నా మన లేదా మన కుటుంబీకుల బ్యాంకుల ఖాతాలు ఖాళీ కావడం ఖాయం. ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు కొందరు ఉన్నతాధికారులు ఎంతో కృషి చేస్తున్నారు. మొత్తమ్మీద మనం అప్రమత్తంగా ఉండడంతోనే ఆర్థికంగా బాగా ఉండగలం లేదా ఉన్నదంతా పరులపాలు కాక తప్పదు. కావున సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ప్రజలదే. సైబర్ చట్టాలపై అవగాహన పెరగడం ద్వారా మాత్రమే నేరాల నియంత్రణ సాధ్యమని నిపుణులు చెబుతున్నారు.

ఏడాదిలో 641 కేసులు - అప్రమత్తతే ముఖ్యం - హోం మంత్రి పరమేశ్వర్

ప్రస్తుత సంవత్సరంలో డిజిటల్ అరెస్టు బెదిరింపులకు సంబంధించి 641 కేసులలో 109 కోట్ల రూపాయలకుపైగా మోసాలు జరిగాయని, ఇందులో రూ.9.45 కోట్లు రికవరీ సాధ్యమైందని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. ఇటీవల పరిషత్‌లో ప్రశ్నోత్తరాల వేళ బీజేపీ సభ్యుడు ప్రతాప్‌సింహనాయక్ అడిగిన ప్రశ్నకు హోం మంత్రి పరమేశ్వర్ స్పందిస్తూ బదులిచ్చారు. నకిలీ సిమ్‌కార్డులు, నకిలీ బ్యాంకు ఖాతాలతో వంచనకు పాల్పడుతున్న సోషల్‌మీడియాలో ఫేస్‌బుక్, టెలిగ్రామ్ యాప్‌ల గ్రూప్‌లను గుర్తించామన్నారు. ఇలా 268 ఫేస్‌బుక్ గ్రూప్‌లు, 265 టెలిగ్రాం గ్రూప్‌లు, 15 ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు, 61 వాట్సప్ గ్రూప్‌లను డి యాక్టివేట్ చేశామన్నారు. దేశవ్యాప్తంగా డిజిటల్ అరెస్టు కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. గత ఏడాది దేశవ్యాప్తంగా 42వేల సైబర్‌నేరాల కేసులు నమోదు కాగా రాష్ట్రంలో 11వేల కేసులు నమోదయ్యాయన్నారు. ప్రజలు సైబర్ నేరాలకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ 1903కు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు.



చరిత్ర సృష్టించనున్న కన్నడ సాహిత్య సమ్మేళనం

- మంత్రి చలువరాయస్వామి
- స్వయంగా ఏర్పాట్ల పరిశీలన

బెంగళూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండ్యలో జరిగే 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం చరిత్ర సృష్టించనుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, సమ్మేళన స్వాగత సమితి అధ్యక్షుడు ఎన్ చలువరాయస్వామి అన్నారు. బుధవారం మండ్య పట్టణంలోని స్వాంజో, అమరావతి హోటల్ వెనుక నిర్మిస్తున్న వేదిక నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు 70-80 ఎకరాల్లో ప్రధాన వేదిక, రెండు సమాంతర వేదికలు, మరో 60 ఎకరాలలో పార్కింగ్ వ్యవస్థ కల్పిస్తున్నట్టు తెలిపారు. 55 వస్తు ప్రదర్శనలు, 350 వాణిజ్య స్టాల్స్, 450 పుస్తక కౌంటర్‌లు ఏర్పాటు కానున్నాయన్నారు. ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు సాగే సమ్మేళనానికి లక్షలాదిమంది విచ్చేయనున్న తరుణంలో వందకుపైగా ఫుడ్ కౌంటర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నమోదు చేసుకున్న ప్రతినిధుల కోసం 40 కౌంటర్‌లు ఉన్నాయని, అందరికీ ఒకే రకమైన భోజన మెనూ ఉంటుందన్నారు.

● ప్రతినిధులకు ప్రత్యేక కిట్


సమ్మేళనానికి ఇప్పటికే 6వేలమంది ప్రతినిధులు నమోదు చేసుకున్నారని మంత్రి వివరించారు. వీరికి మండ్యకు చెందిన అరకిలో బెల్లం, అరకేజీ చక్కెర, బ్రష్, పేస్ట్, సోప్, బెడ్‌షీట్‌లతో కూడిన లెదర్‌బ్యాగ్ కిట్‌ను అందచేస్తామని వివరించారు. వారు బస చేసేందుకు తగిన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

● 7 తాలూకాల నుంచి ఉచిత బస్సులు

సమ్మేళనానికి విచ్చేసే తాలూకా కేంద్రాల నుంచి 15 ఉచిత బస్సుల వ్యవస్థ కల్పిస్తున్నామన్నారు. వీటికితోడు మండ్య నగరం నుంచి సమ్మేళనం స్థలానికి ఉచితంగా చేరుకునేలా వ్యవస్థ ఉందన్నారు. మూడుచోట్ల పార్కింగ్‌ను కల్పించామన్నారు. సమ్మేళనం జరిగే మూడు రోజులలో మైసూరు, బెంగళూరు నుంచి ప్రతి అరగంటకో బస్సు సంచారం ఉంటుందన్నారు.

● నేడు సమ్మేళనాధ్యక్షుల రాక

అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షులు గో.రు.చన్నబసప్ప గురువారం సాయంత్రం మండ్యకు విచ్చేయనున్నారు. వారిని సాదరంగా స్వాగతిస్తామన్నారు. 20న శుక్రవారం ఉదయం 6 గంటలకు పతాకావిష్కరణ, 7 గంటలకు సమ్మేళనాధ్యక్షుల ఊరేగింపు ఉంటుందన్నారు. పగటివేషగాళ్ళు, మహిళా వీరగాసె, గొరవర కుణిత, కంసాళె, కరగ, సుగ్గికుణిత బృందాలతో కలిపి 300మంది మహిళలు కళశాలతో ఊరేగింపులో పాల్గొంటారన్నారు. ఊరేగింపును మైసూరు రాజమాత ప్రమోదాదేవి ఒడయార్ ప్రారంభిస్తారన్నారు.



ముస్తాబైన సభాప్రాంగణం

● స్వచ్ఛతకు ప్రాధాన్యం

మండ్యలో కన్నడ సాహిత్య సమ్మేళనం మూడోసారి జరగనుందని స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఆహార నాణ్యతను పరీక్షించి నివేదిక తెప్పించుకుంటున్నామన్నారు. నీటికి సైతం పరీక్షలు జరిపించామన్నారు. స్వచ్ఛతకోసం 250మంది సిబ్బందిని నియమించామని, 150కుపైగా స్థలాల్లో తాత్కాలిక శౌచాలయాలు నిర్మించామన్నారు.

● విద్యుద్దీపాలతో నగరవీధులు ముస్తాబు

దసరా ఉత్సవాల వేళ మైసూరును అలంకరించిన తరహాలో మండ్య పట్టణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించనున్నారు. కన్నడ రాష్ట్రానికి, బాషకు సేవలందించిన 170 మంది సాధకులను సన్మానించనున్నారు. 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం సందర్భంగా 87 పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా 'బెల్లదారతి' పేరిట స్మరణ సంచికను ఆవిష్కరించనున్నారు. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నాడోజ మహేశ్‌జోషి మాట్లాడుతూ సమ్మేళనానికి పూర్తిస్థాయి సాంకేతికతను వినియోగిస్తుండడంపై జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. మూడు వేదికలకు సమాన గౌరవం, ఘనత ఉంటుందన్నారు. సమ్మేళనంలో సమ్మేళనాధ్యక్షుడు గో.రు.చన్నబసప్ప ఆంగ్లం నుంచి కన్నడకు అనువాదం చేసిన ప్రాచీన భారతంలో రాజకీయ హింసాచారం, కన్నడ నుంచి ఇటాలియన్‌లోకి అనువాదంలో పేరొందిన నవలా రచయిత్రి త్రివేణికి చెందిన 'శరపంచర' నవల ఆవిష్కారం కానున్నాయన్నారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు రమేశ్‌బాబు, బండిసిద్దేగౌడ, రవికుమార్ గణిగ, దినేశ్ గూళిగౌ, జిల్లా అధికారి డాక్టర్ కుమార, జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి, జడ్పీ సీఈఓ షేక్ తన్వీర్ ఆసిఫ్, 'అక్క' సంస్థాపకుడు అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనం రథం నమూనా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి చలువరాయస్వామి



ఆహార నాణ్యత పరిశీలిస్తూ..

గృహలక్ష్మి మొత్తాన్ని సద్వినియోగం చేసుకోండి: సీఎం



సీఎంతో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు

బెంగళూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి యజమానురాలికి గృహలక్ష్మి పథకం ద్వారా ఇస్తున్న మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సిద్దరామయ్య సూచించారు. బెళగావి సువర్ణసౌధలో బుధవారం ఆయనను 21మంది గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు భేటీ అయి ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ఆర్థిక స్వావలంబనకోసం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో ప్రయోజనం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, గ్యారెంటీ పథకాల అమలు కమిటీ అధ్యక్షుడు హెచ్‌ఎం రేవణ్ణ ఉన్నారు.


అంగన్‌వాడీలతో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ చర్చలు

బెళగావి సువర్ణసౌధ సమీపంలోని కొండసకొప్ప వద్ద భారీ సంఖ్యలో చేరిన అంగన్‌వాడీల దర్నా స్థలానికి మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ చేరుకుని వారి సమస్యలను ఆలకించారు. వారినుంచి వినతులు స్వీకరించిన అనంతరం డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వ్యాపారులు.. దళారీల మధ్య వాగ్వాదం

- బళ్లారి ఏపీఎంసీలో నిలిచిపోయిన లావాదేవీలు

బళ్లారి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బళ్లారి వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌లో వేరుశనగ వ్యాపారులు, దళారుల మధ్య వాగ్వాదం జరగడంతో బుధవారం రోజంతా వ్యాపారాలు నిలిచిపోయింది. బ్రోకర్లు మంచి గ్రేడ్ వేరుశనగతో సాధారణ గ్రేడ్ వేరుశనగను జోడించారు. దీంతో నాకు అన్యాయం జరుగుతోందని ఓ వ్యాపారి ఆరోపించారు. అలాగే బ్రోకర్లకు చెల్లించాల్సిన రూ.16 లక్షల బకాయిని తనవద్దే ఉంచుకున్నట్లు సమాచారం. బుధవారం ట్రేడింగ్ నిలిచిపోవడానికి ఇదే కారణమని సంబంధిత వర్గాలు తెలిపాయి. విషయం తెలుసుకున్న ఏపీఎంసీ డైరెక్టర్ వ్యాపారులు, దళారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. ఇతర ఉత్పత్తులు గురువారం నుంచి వర్తకం కానున్నాయి. శుక్రవారం నుంచి వేరుశనగ వ్యాపారం జరుగుతుందని దళారులు చెప్పినా వివాదం సద్దుమణగకుంటే వ్యాపారం సాగుతున్న సంగతి తెలిసిందే. వ్యాపారులు దళారులకు, దళారులు రైతులకు వ్యాపారం జరిగిన రోజే చెల్లించాలనే నిబంధన వుంది. అయితే దళారులకు వ్యాపారులు సక్రమంగా డబ్బులు చెల్లించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై స్పందించేందుకు ఏపీఎంసీ డైరెక్టర్ నంజుండస్వామి అందుబాటులోకి రాలేదు.



నగరోత్సవంలో అయ్యప్పస్వామి

నేత్రపర్వంగా అయ్యప్ప నగరోత్సవం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కో దండ రామాలయం ఆవరణలోని హరిహరసుత అ య్యప్పస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం సా యంత్రంస్వామి నగరోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలో అయ్యప్పస్వా మికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో వినాయకుడు, లక్ష్మీదేవి, అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులను ఉంచి, పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు జ్యోతులతో ముందు సాగుతుండగా.. అయ్యప్పదీక్షధారులు శరణుఘోష, గీతాలాప నలతో పాల్గొన్నారు. బాణసంచా పేలుళ్లు, చెక్కభజనలు, దేవతా వేషధారుల సందడితో ఉత్సవం సాగింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ. రమేష్ బాబు, గురుస్వాములు లక్ష్మిరెడ్డి, రంగాచారి, మణికంఠ బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సోమర జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



నగరోత్సవంలో పాల్గొన్న దీక్షధారులు

న్యూస్‌బాక్స్

21 నుంచి ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా ఈ నెల 21వ తేదీ నుంచి ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆర్డీటీ స్టేడియంలో జరగనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగా రెడ్డి తెలిపారు. ఆంధ్రా జట్టుకు జిల్లా క్రీడాకారులు వీరారెడ్డి, జయంత్ కృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెండు జట్ల క్రీడాకారులు గురువారం అనంత క్రీడా గ్రామానికి చేరుకుంటారు.

నేడు ఆటగాళ్ల పేర్ల నమోదు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 21 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలకు పేర్లను నమోదు చేసుకోనున్నారు. ఈ నెల 19వ తేదీ గురువారం ఉదయం 10గంటల నుంచి అనంతపురం అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ఆన్‌లైన్ పేర్ల నమోదు ప్రక్రియను నిర్వహిస్తామని డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ లక్ష్మి తెలిపారు. 18 సంవత్సరాలలోపు వయసు ఉండి, ఫెన్సింగ్‌లో ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, జననధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని తెలిపారు.

21న ప్రాజెక్ట్ కమిటీల ఎన్నిక


అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలవ కమిటీ, భైరవాన్‌తిప్ప ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికల ప్రక్రియ ఈనెల 21న నిర్వహిస్తామని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. నగరంలోని హెచ్చెల్సీ కాలనీ లోక్ డివిజన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక పూర్తి అయిందని అన్నారు. అసాధారణ సర్వసభ్య సమావేశం, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు నామినేషన్ల స్వీకరణ, ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన అదే రోజున ఉంటాయని తెలిపారు.

రైతన్నకు దిగులే..!

రబీలో వేరుశనగకు తెగుళ్ల బెడద

ఉధృతంగా ఆకుముడత, లద్దెపురుగు

ఆందోళనలో అన్నదాతలు



వేరుశనగ పంటకు సోకిన తెగుళ్లు

గుత్తిరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన వేరుశనగ పంటను తెగుళ్లు వదలడం లేదు. లేత దశలో ఉన్న వేరుశనగ పైరును అప్పుడే తెగుళ్లు చుట్టేశాయి. పైరుకు ఆకుముడత తెగులుతో పాటు లద్దెపురుగు, మూతపురుగు ఆశించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా బోరుబావుల కింద వెయ్యి ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. పంట సాగు చేసి 20నుంచి 25 రోజులు కావస్తోంది. మండలంలోని గొందిపల్లి, జక్కలచెరువు, గాజులపల్లి, తొండపాడు, టీ. కొత్తపల్లి, కొత్త పేట, వన్నేదొడ్డి, ఎంగిలిబండ, ఇసురాళ్లపల్లి, కరిడికొండ, రజాపురం, చెర్లోపల్లి, ఈశ్వరపల్లి, తదితర గ్రామాల్లో వేరుశనగ పంటను బోరుబావుల కింద సాగు చేశారు. చీడపీడల నుంచి పంటను కాపాడుకునేందుకు పలు రకాల మందులను పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోంది. వాతావరణ మార్పులు, తుఫాను దెబ్బకి పంటకు తెగుళ్లు సోకుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పంటకు ట్రాక్టరుతో మందు పిచికారీ చేస్తున్న రైతు

లద్దెపురుగు విపరీతంగా ఆశించింది



నేను 10 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. 20 రోజుల పైరును లద్దెపురుగు ఆశించింది. నివారణకు పురుగుల మం దు పిచికారీ చేశా. వాతావరణ మార్పుల కారణంగా వేరుశనగ పంటకు తెగుళ్ల ఉధృతి అధికమైంది. వాటికి తోడు తు ఫాను ప్రభావంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- రైతు శ్రీనివాస్ చౌదరి, ధర్మాపురం

ఆకుముడత తెగులు వ్యాపించింది



నేను రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఆకుముడత తెగులు వ్యాపించింది. ఒక సారి మందు పిచికారీ చేసిన ఫలితం లేదు. పంట సాగు చేసి 20 రోజులు గడిచినా వాతావరణ మార్పుల వలన ఎదుగుదల కనబడటం లేదు. వాతావరణం అనుకూలిస్తేనే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

- గోవిందు రైతు బసినేపల్లి తండా



పంటను ఆశించిన లద్దెపురుగు

వాతావరణ మార్పులతోనే..

వేరుశనగ పంటకు ఆకుముడత తెగులు ఆశించి ఉంటే ఎకరానికి 500 ఎంఎల్ క్లోరోఫైరిఫాస్, 300 గ్రాములు అస్పేట్ పొడి మందును పిచికారీ చేయాలి. లద్దెపురుగు నివారణకు ఎకరానికి నూవాన్ ప్లేస్, అస్పేట్ 100 గ్రాములు చెప్పున స్ప్రే చేయాలి. పురుగు ఉధృతంగా ఉంటే వారం రోజుల వ్యవధిలో మరో సారి పిచికారీ చేయాలి. వాతావరణ మార్పుల కారణంగా పంటకు తెగుళ్లు సోకుతున్నాయి.

- ముస్తాక్ అహమ్మద్, వ్యవసాయాధికారి, గుత్తి

జగన్ బొమ్మ తీసేయండి

రీ సర్వే రాళ్లపై తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం

కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశాలు

అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో భూ సర్వే పేరుతో జగన్ బొమ్మతో ముద్రించిన రాళ్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రీసర్వేను ఆపేయడంతోపాటు అప్పుడు జరిగిన అవకతవకలను సరిదిద్దడానికి రెవెన్యూసదస్సులు నిర్వహిస్తోంది. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో సర్వే రాళ్లపై ఉన్న జగన్ బొమ్మలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు.

అనంతలో 2,60,690 రాళ్లకు జగన్‌బొమ్మలు

వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పథకాన్ని 2020లో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చింది. అందులో భాగంగా జిల్లాలో తొలి విడతగా 198గ్రామాలలో 5,88,615ఎకరాలలో రీసర్వే చేపట్టారు. ఈగ్రామాలలో రీసర్వే అనంతరం హద్దులలో జగన్‌బొమ్మతో కూడిన 2,60,690 రాళ్లను నాటారు. ఈరాళ్లకు ఉన్న జగన్ పేర్లను తొలగించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇంకో వైపు ఆసమయంలో రైతులకు జారీ చేసిన జగన్‌బొమ్మతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రద్దుచేసి, ప్రభుత్వం ముద్రతో రూపొందించిన పుస్తకాలను అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ఇదేవిషయంపై ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈమేరకు వాటిన అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది.



జగన్ బొమ్మలతో సరఫరా చేసిన రీసర్వే రాళ్లు (ఫైల్)

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

రీసర్వే విషయంలో రాష్ట్రప్రభుత్వ ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సీఎం ఆదేశాలు ఇచ్చిన విషయం వాస్తవమే. జిల్లా కలెక్టరు, జేసీలు దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటారు. దాని ప్రకారం రాళ్లపై ఉన్న జగన్ బొమ్మలు, పేర్లను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.

-రూప్లానాయక్, ఏడీ, సర్వేశాఖ

రోజూ కందులు కొనాలి

నేటి నుంచే రైతుల పేర్లు నమోదు చేసుకోండి

ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన కందులను ప్రతిరోజు మార్కెట్ ధరకు కొనుగోలు చేయాలని అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్క్‌ఫెడ్, తదితరశాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ కందుల కొనుగోలు విషయంలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా, అందరిని సమన్వ యం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో గురువారం నుంచే రైతుల పేర్లు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ, డీసీఓ, డీసీఎంఎస్‌లకు కేటాయించిన కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా కందులు కొనేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గోడౌన్‌లు, కొనుగోలు కేంద్రాలవద్ద కార్యకలాపాలు సజావుగా జరిగేలా మార్క్‌ఫెడ్ అధికారులు చూడాలన్నారు. కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, కొనుగోలు చేసిన కందులను గోడౌన్‌లకు రవాణా చేయడానికి, భద్రపరచడానికి సర్వం సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, మార్క్‌ఫెడ్ మేనేజర్ పెన్నేశ్వరి, మార్కెటింగ్ అధికారి సత్యనారాయణచౌదరి, జిల్లా సహకారఅధికారి అరుణకుమారి, డీసీఓ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పాల్గొన్నారు.

జీఆర్పీకి ఏబీసీడీ

సాంకేతిక అవార్డు



డీజీపీ నుంచి అవార్డును అందుకుంటున్న గుంతకల్లు జీఆర్పీ ఎస్పీ

గుంతకల్లు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే పోలీసులకు అబౌ అండ్ బియోండ్ ద కాల్ ఆఫ్ డ్యూటీ (ఏబీసీడీ) అవార్డు దక్కింది. విజయవాడలో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో డీజీపీ ద్వారకా తిరుమల రావు చేతుల మీదుగా రైల్వే ఎస్పీ రాహుల్ మీనా, ఆయన టీం సభ్యులు ఏబీసీడీ అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో సాంకేతికత వినియోగం, కేసుల పరిష్కారంలో సాధించిన ఫలితాలకు ఈ అవార్డులను ప్రకటించారు. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయిలో గుంతకల్లు రైల్వే డివిజన్ రెండో స్థానంలో నిలిచింది. గత సంవత్సరం మూడో స్థానంలో నిలిచింది. గుంతకల్లు డివిజన్ వరుసగా రెండుసార్లు అవార్డును సాధించడం విశేషం. సమష్టి కృషితో గుంతకల్లు రైల్వే పోలీసు జిల్లా విభాగం అవార్డును దక్కించుకుందని ఎస్పీ రాహుల్ మీనా అన్నారు.

మంచి రోజులు వచ్చినట్లేనా..?

మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి ప్రతిపాదనలు

మూడు దఫాలు తిరస్కరించిన వైసీపీ ప్రభుత్వం

ప్రస్తుతం రూ.14.65కోట్లతో అంచనాలు పంపిన అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మారిన పరిస్థితుల నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ, జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈలు కలిపి రూ.14.65కోట్లతో ప్రతి పాదనలు పంపారు. కార్యాలయ నిర్మాణానికి అవసరమైన నిధులను ఏపీఎంఎస్‌ఐడీసీ ద్వారా అందజేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

స్థలం కాజేసేందుకు వైసీపీ విఫలయత్నం


నగర నడిబొడ్డున రూ.కోట్ల విలువ చేసే సుమారు మూడెకరాల స్థలంపై గతంలో వైసీపీ పాలకులు కన్నేశారు. దాన్ని సొంతం చేసుకోవడానికి విఫలయత్నం చేశారు. ఈక్రమంలోనే రెండున్నరేళ్ల కిందట కురిసిన భారీ వర్షానికి శిథిలావస్థలో ఉన్న మైనర్ ఇరిగేషన్ కార్యాలయ భవనం కుప్పకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. అయితే కార్యాలయం మరమ్మతులు, నూతన భవనం నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం యత్నించలేదు. పైగా ఆ స్థలాన్ని కాజేసేందుకు ఆ పార్టీ నేతలు యత్నించారు. వైసీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి మొదట ఆ పార్టీ పెద్దలు ఈ స్థలంపై కన్నేయగా అది విఫలం కావడంతో హెచ్చెల్సీ కాలనీలోని స్థలాన్ని ఎంపిక చేసుకున్నారు. నూతన కార్యాలయ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వంలో జలవనరుల శాఖ, మైనర్ ఇరిగేషన్ అధికారులు మూడు దఫాలుగా ప్రతిపాదనలు పంపినా తిరస్కరణకు గురైంది. అయితే కూటమి ప్రభుత్వం కార్యాలయ ని ర్మాణానికి అంచనాలు పంపమని అధికారులను అడగ డంతో ఆశాఖ ఉద్యోగుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

శిథిలావస్థకు చేరిన కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పగలు పిచ్చాపాటిగా మాట్లాడుకునేందుకు, వాహనాల పార్కింగ్‌కు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అడ్డాగా మారింది. చీకటిపడితే మం దుబాబులు అక్కడికి మద్యం తెచ్చుకుని సేవిస్తున్నారు. ఉదయం కార్యాలయానికి వచ్చే ఉద్యోగులకు ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్ పీకలు కనిపిస్తున్నాయి. సరైన భద్రత లేకపోవడంతో ఉద్యోగులు భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ప్రభుత్వ ఆదేశాలతోనే మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి ప్రతి పాదనలు పంపాం. రూ.14.65కోట్లతో జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈ ద్వారా ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశాం. గతంలో కూడా ప్రతిపాదనలు పంపినా తిరస్కరించారు. ప్రధాన కార్యాలయం భవనం పైభాగం కుప్ప కూలింది. అయితే ఆ సమయంలో ఎవరూ కార్యాలయంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కార్యాలయంలోకి బయటవారిని రాకుండా చూసుకుంటున్నాం. కార్యాలయం పనివేళల తరువాత, సెలవు దినాలలో గేటుకు తాళం వేయాలని సూచించాం.




- విశ్వనాథ్‌రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ



కూలిన మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం (ఫైల్)



మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో బయట వ్యక్తుల వాహనాలు పార్కింగ్



కూలేందుకు సిద్ధంగా ఉన్న పైకప్పు

వేతన ఖాతా ప్రయోజనాలపై అవగాహన

అనంతపురం క్రైం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల వినతి మేరకు వారి శాలరీ ప్యాకేజీపై (వేతన ఖాతా ప్రయోజనాలు) అధికారులు అవగాహన సదస్సును నిర్వహించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు బుధవారం నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. హోంగార్డ్స్ దర్బార్‌లో ఈ నెల 6న ఎస్పీ జగదీష్‌కు హోంగార్డులు తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. తమ బ్యాంకులోని శాలరీ అకౌంట్ ద్వారా ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో బ్యాంకు అధికారులు వివరించారు.

- అనంతపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సెంట్రల్ పోలీస్ క్యాంటిన్ విస్తరణ పనులకు పోలీసు అధికారులు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాలతో అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా సీపీసీ భవనం పక్కనే విస్తరణ పనులను ప్రారంభించారు. కార్యక్రమాలలో ఆర్ఐలు రాముడు, మధు, ఆర్ఎస్ఐ మగ్బూల్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం నాయకులు త్రిలోక్‌నాథ్, సూర్యకుమార్, హరినాథ్, తేజ్‌పాల్, ఆనంద్, లక్ష్మీనారాయణ, ఎస్పీ సీసీ అంజనేయప్రసాద్, ఎస్బీఐ అధికారులు వేణుగోపాల్, రాఫెల్ రాజు, నవీన్ మురహరి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఏఎస్పీ



సీసీ రోడ్డు వేయకముందు పరిస్థితి

మారుతున్న

రూపురేఖలు

ఉరవకొండ, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలోని ప్రధాన రోడ్డు అభివృద్ధి ఎట్టకేలకు ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఉపాధి పథకం కింద రూ.12లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టింది. గతంలో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు రోడ్డుపైనే నిలబడి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగేది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వాహనదారుల అదుపు తప్పి కింద పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వా టీడీపీ నాయకులు చొరవ తీసుకుని సీసీరోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కాగా డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన టీడీపీ నాయకులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు వేసిన తర్వాత..

ఎన్ని కష్టాలో..!

బర్త్ సర్టిఫికెట్ల కోసం తల్లిదండ్రుల అగచాట్లు

శెట్టూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అపార్ జనరేషన్‌కు అవసరమైన బర్త్ సర్టిఫికెట్ల కోసం తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బర్త్ సర్టిఫికెట్‌కు అవసరమైన పత్రాల కోసం మీ సేవ, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. నోటరీ కోసం, మీసేవ కేంద్రంలో నమోదు కోసం వందలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. పనులు వదులుకుని మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావడానికి చాలా డబ్బులు ఖర్చు అవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి అపార్ ప్రక్రియను సరళీకృతం చేయాలని కోరుతున్నారు.

రూ.ఐదు వేలు ఖర్చయ్యాయి



జనన ధ్రువీకరణ పత్రం మంజూరు కోసం రూ. ఐదు వేలు ఖర్చయ్యింది. అయినా ఇప్పటికీ పూర్తి కాలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి కాళ్లరిగిపోయాయి. ప్రభుత్వం స్పందిం చి అపార్ వ్యవహారాన్ని సులభతరం చేయాలి.

- చిరంజీవి, పర్లచేడు గ్రామం

ఓపిక నశిస్తోంది



ఇప్పటికే జనన ధ్రువీకరణ పత్రం కోసం, నోటరీ కోసం లాయర్ వద్దకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం, మీ సేవ ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగడానికి రూ. నాలుగు వేలు ఖర్చయ్యింది. ఇన్ని కార్యాలయాల చుట్టూ తిరగడానికి ఓపిక నశిస్తోంది. అవసరం కాబట్టి తిరుగుతున్నాం.

- మంజునాథ, పర్లచేడు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఓం ప్రకాశ్ బక్షి (జయంతి)



హిందీ సినీరంగంలో క్యారెక్టర్ నటుడుగా పేరొందిన ఓం ప్రకాశ్ బక్షి 1919 డిసెంబరు 19న జమ్ములో జన్మించారు. కామెడీ పాత్రల్లోనూ సత్తా చాటుకున్నారు. 307 సినిమాలలో విభిన్న పాత్రలలో నటించారు. ఆలిండియా రేడియోలో కెరీర్‌ను ప్రారంభించారు. 'ఫతే దిన్' కార్యక్రమంతో పంజాబ్ వ్యాప్తంగా పేరొందారు. కాగా హిందీలో అమితాబ్ బచ్చన్‌తో కలసి పలు సినిమాలలో నటించారు. నిర్మాతగా ఎన్నో విజయవంతమైన సినిమాలు అందించారు. 1998 ఫిబ్రవరి 21న కన్నుమూశారు.

ప్రతిభా పాటిల్ (పుట్టినరోజు)



దేశ 12వ రాష్ట్రపతిగా వ్యవహరించిన ప్రతిభాపాటిల్ 1934 డిసెంబరు 19న మహారాష్ట్ర రాష్ట్రం నందగావ్ ప్రాంతంలో జన్మించారు. తొలి మహిళా రాష్ట్రపతిగానే కాక, మహారాష్ట్ర నుంచి రాష్ట్రపతి పదవిని చేపట్టిన తొలి వ్యక్తి. 2007నుంచి 2012వరకు రాష్ట్రపతిగా సేవలందించారు. 2004 నుంచి 2007 వరకు రాజస్థాన్ గవర్నర్‌గా వ్యవహరించారు. 1967లో జలగావ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత ముక్తైనగర్ నుంచి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. 1985 నుంచి 1990 వరకు రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగారు. 2018లో మెక్సికా దేశం నుంచి 'ఆర్డర్ ఆఫ్ ది అజ్‌టెక్ ఈగల్' ప్రత్యేక గౌరవాన్ని పొందారు.

రికీ పాంటింగ్ (పుట్టినరోజు)



ఆస్ట్రేలియా దేశ క్రికెటర్ రికీ థామస్ పాంటింగ్ 1974 డిసెంబరు 19న జన్మించారు. క్రికెట్ కోచ్‌గాను, కామెంటేటర్‌గాను వ్యవహరించారు. ప్రస్తుతం ఐపీఎల్ 2025 పంజాబ్ కింగ్స్ జట్టు ప్రధాన కోచ్‌గానే కాక మేజర్ లీగ్ క్రికెట్‌లో రెండో సీజన్‌కు వాషింగ్టన్ ఫ్రీడం జట్టుకు కూడా ప్రధాన కోచ్‌గా ఉన్నారు. ఇంటర్నేషనల్ క్రికెట్ హిస్టరీలో విజయవంతమైన కెప్టెన్‌గా రాణించారు. 324 మ్యాచ్‌లకుగాను 220లో విజయం సాధించారు. ఆయన కెప్టెన్సీ వహించిన 2004 నుంచి 2011 కాలాన్ని గోల్డెన్ ఎరాగా అభివర్ణించారు. కుడిచేతి వాటం కల్గిన బ్యాట్స్‌మన్, స్లిప్ / క్లోజ్ క్యాచింగ్ ఫీల్డర్, అప్పుడప్పుడు బౌలర్‌గా ఉండేవారు. 'క్రికెటర్ ఆఫ్ ది డికేడ్ 2000'గా పేరొందారు. నాలుగుసార్లు అలన్ బోర్డర్ మెడల్ అందుకున్నారు.

గ్రామీణ సొబగును చాటేలా జాతరలు

శిడ్లఘట్ట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అనేకచోట్ల గ్రామ జాతరలు తమ మూల ఆశయాలను మరిచి సాగుతున్నాయని అయితే దేవరమళ్ళూరు జాతర తమ గ్రామ సొబగును చాటేలా కొనసాగుతుండడం అభినందనీయమని బాలాజీ సేవా ట్రస్టు అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామంలో మళ్ళూరాంబదేవి బ్రహ్మోత్సవం నేపథ్యంలో ఫ్లడ్‌లైట్ కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈసారి కబడ్డీ పోటీలతోపాటు రంగవల్లుల పోటీలు, కోలాటం వంటివి నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. క్రీడను క్రీడలుగా చూడాలనిపోటీలలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అభిప్రాయపడ్డారు. ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ.20, 10వేలు బహుమతి, ట్రోఫీ ప్రదానం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సీనియర్ రిటైర్డు కబడ్డీ క్రీడాకారుడు నారాయణస్వామి సహా పలువురు క్రీడాకారులు, రాష్ట్రపురస్కార గ్రహీత యువకవి చన్నకృష్ణను సత్కరించారు. గ్రామం నుంచి వివిధ ప్రాంతాలనుంచి 22కుపైగా కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు సీకల్ ఆనందగౌడ, కంబదహళ్ళి సురేంద్రగౌడ, దూగరనాయకనహళ్ళి ఆంజనేయగౌడ, కన్నప్పనహళ్ళి లక్ష్మీనారాయణ, ఆలయ అభివృద్ధి సమితి అధ్యక్షుడు, న్యాయవాది రాధా మునిరాజగౌడ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల ప్రారంభంలో సీకల్ రామచంద్రగౌడ తదితరులు

చెరువు ఆక్రమణలు తొలగించాలి



తాలూకా కార్యాలయం వద్ద నిరసన

» కసాప ఆధ్వర్యంలో నిరసన

దొడ్డబళ్ళాపుర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలనజోగిహళ్ళిలో లే అవుట్‌లలో నిర్మాణాలు జోరందుకున్నాయని, ఇటీవల మార్కెట్ ధరలు పెరిగాయని, అవసరమైన రోడ్ల ఏర్పాటుకు చెరువును సైతం ఆక్రమించేస్తున్నారని ఆరోపిస్తూ కరవే ఆధ్వర్యంలో బుధవారం తాలూకా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దొడ్డబళ్ళాపుర శివారులోని పాలనజోగహళ్ళి చెరువు సర్వే 21లో 20 అడుగుల రోడ్డు నిర్మిస్తున్నారన్నారు. చెరువును ఆక్రమించి రోడ్డు నిర్మాణం సరికాదని కరవే (ప్రవీణ్‌శెట్టి వర్గం) తాలూకా అధ్యక్షుడు హమామ్ వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. చెరువులను సంరక్షించాల్సిన అధికారులు లే అవుట్‌లకోసం ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైన ఉన్నతాధికారులు స్పందించిన తగిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో చెరువులోనే ధర్నా చేస్తామన్నారు. నిరసనలో సంఘం గౌరవాధ్యక్షుడు మహేశ్, సంఘం ప్రధాన కార్యదర్శి వేణు, కోశాధికారి ఆనంద్‌కుమార్, నగర అధ్యక్షుడు శ్రీనగర బషీర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

విజయపుర, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): క్రీడాపోటీల్లో గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో సమానంగా స్వీకరించాలని ప్రగతి విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృపాశంకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో పదో తరగతి విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. క్రీడాపోటీల్లో ఓడిపోతే కుంగిపోరాదని మానసికంగా ధైర్యంగా ఉండాలన్నారు. పరుగు, ఇతర పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని కృపాశంకర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జేఎస్ ప్రకాశ్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బసవరాజు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని వీక్షించారు.



అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ కృపాశంకర్ తదితరులు

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

శిడ్లఘట్ట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మళమాచనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని జేడీఎస్ యువ నాయకుడు ఎంజీ నవీన్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఇటీవల గ్రామపంచాయతీకి జరిగిన ఎన్నికల్లో 14 స్థానాలకుగాను 13 చోట్ల జేడీఎస్ మద్దతుదారులు గెలుపు సాధించారని ఇందుకు కారణమైన ప్రజలకు ధన్యవాదాలన్నారు. మళమాచనహళ్ళి గ్రామంలోని బ్యాటరాయస్వామి, శివపార్వతులు, గంగమ్మ, సప్పలమ్మ ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 8న జంగమకోటె హోబళిలోని మళమాచనహళ్ళి, భక్తరహళ్ళి, హొసపేట, నాగమంగల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారులు ఎక్కువసంఖ్యలో గెలుపొందారన్నారు. 20 ఏళ్ల తర్వాత జేడీఎస్ మద్దతుదారులు అధికారం చేపట్టారన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ నేతృత్వంలో సాగుతున్న అభివృద్ధియే కారణమన్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు ఎంసీ జగదీశ్, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎం రాజశేఖర్, ఎంపిసిఎస్ అధ్యక్షుడు రామచంద్రచారి, గ్రామపంచాయతీ నూతన సభ్యులు రాజశేఖర్, నటరాజ్, విజయలక్ష్మమ్మ శ్యామల, సుధా, ప్రముఖులు ఎంపి కృష్ణప్ప, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



జేడీఎస్ యువనాయకుడు నవీన్‌కుమార్ తదితరులు

కేఐఏడీబీ తీరుపై రైతుల నిరసన

● బలవంతపు భూస్వాధీనం తగదని ఆందోళన

దొమ్మసంద్ర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) ఆధ్వర్యంలో ఆనేకల్ తాలూకాలో వ్యవసాయ భూములను బలవంతంగా లాక్కునే యత్నం చేస్తోందని తాలూకా భూస్వాధీనం వ్యతిరేక పోరాట సమితి మండిపడింది. కేఐఏడీబీ తీరును ఖండిస్తూ బుధవారం సర్జాపుర హోబళి రైతులు బైక్ జాథా నిర్వహించారు. కొమ్మసంద్ర గ్రామంలోని బయలు బసవేశ్వర ఆలయం నుంచి చందాపుర మీదుగా ఆనేకల్ పట్టణంలోని కళాశాల మైదానానికి చేరుకున్నారు. అక్కడనుంచి తహసీల్దారు కార్యాలయానికి రైతులు పాదయాత్రగా సాగి వినతిపత్రం సమర్పించారు. మా భూమి - మా హక్కు అంటూ నినాదాలు చేశారు. స్పెషల్ తహసీల్దారు కరియప్పనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి పదాధికారులు మాట్లాడుతూ ఆనేకల్ తాలూకాలో ఇప్పటికే నాలుగు పారిశ్రామికవాడలతోపాటు సూర్యసిటీ మూడు దశలలో ఉందని ఇందుకు అవసరమైన భూమికోసం రైతులనుంచి తీసుకున్నారన్నారు. ఇప్పటికే ట్రాఫిక్ సమస్య పెరిగిందన్నారు. తాజాగా మళ్లీ సాగుభూములను బలవంతంగా లాక్కునేలా కేఐఏడీబీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. పరిశ్రమలకు సాగుభూములు లాక్కోవడం సరికాదన్నారు. నిరసనలో స్థానిక రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



స్పెషల్ తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

టెక్స్‌టైల్ పార్క్ మంజూరు చేయాలి

● రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ



రాయచూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పత్తిసాగు అధిక సంఖ్యలో ఉన్న రాయచూరు జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ కోరారు. బెళగావిలో జరుగుతున్న శాసనసభ శీతాకాల సమావేశాల సందర్భంగా బుధవారం ఆయన ప్రభుత్వానికి జిల్లా సమస్యలు వినిపించారు. గత బీజేపీ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్క్‌ను కలబుర్గి జిల్లాకు మంజూరు చేయడం సరికాదన్నారు. కలబుర్గి జిల్లాలో కందిపంట సాగు పెద్ద ఎత్తున ఉండగా రాయచూరు జిల్లాలో పత్తిసాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని ఇక్కడి రైతులకు టెక్స్‌టైల్ పార్క్ వల్ల అనేక రకాల ఉపయోగం ఉంటుందన్నారు. దీంతో పాటు టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కాగా ఎన్ఆర్‌బీసీ కాల్వకు నీటిని విడుదల చేసి తమ నియోజకవర్గానికి మరింత సాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి డీకే శివకుమార్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఎన్ఆర్‌బీసీకి నిధులు విడుదల చేసేందుకు కృషి చేయాలని కోరారు.

పరిషత్‌లో పలు బిల్లులు ఆమోదం

బెంగళూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బెళగావి శాసనసభ శీతాకాల సమావేశాల్లో బుధవారం పరిషత్‌లో పలు బిల్లులను ఆమోదించారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్, విశ్వవిద్యాలయ బిల్లు ఆమోదమయ్యాయి. పంచాయతీరాజ్, ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే బిల్లును ప్రతిపాదించారు. సభ్యులు శరవణ, సీటీ రవి, తళవార సాబణ్ణ, శశిల్ నమోశి, ఎస్‌వి సంకనూరు, ఐవన్ డిసౌజా, ప్రతాప్‌సింహ నాయక్, రవికుమార్, బల్కిస్‌బాను, కేశవప్రసాద్, షట్టణ్ణ, హనుమంత నిరాణి, చిదానందగౌడ, గోవిందరాజు, నాగరాజ్, అరుణ్, తిప్పేస్వామి పూజార్ ప్రసంగించారు. విశ్వవిద్యాలయ పాలనా వ్యవస్థ మరింత మెరుగ్గా నిర్వహించాల్సి ఉందని, యువతకు గుణాత్మక విద్య, పరిశోధనలు, ఆవిష్కరణ, ఉద్యమశీలత పెంచడంలో విశ్వవిద్యాలయాలు దేశానికి మాదిరిగా మార్చే బిల్లును ఆమోదించాలని మంత్రి కోరారు. ప్రతిపక్షాల అభ్యంతరం వ్యక్తం చేయగా, సభ్యుల హాజరు 26/25తో బిల్లును ఆమోదించారు.

కాగా శాసనసభలో ఆమోదించబడిన కర్ణాటక (ఖనిజ హక్కులు, ఖనిజం కల్గిన భూమి) పన్నుల బిల్లు 2024ను పరిషత్‌లో ఆమోదించారు. గనులశాఖ మంత్రి మల్లికార్జున్ బిల్లును ప్రతిపాదించగా సభ్యులు సతీశ్, పూజార్, హనుమంత నిరాణి, సీటీ రవి, రవికుమార్‌లు ప్రసంగించారు. మూజువాణి ఓటు ద్వారా బిల్లు ఆమోదం పొందింది. అదే విధంగా బీబీఎంపీ రెండో సవరణ బిల్లు కూడా ఆమోదం పొందింది.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జడ్పీ సీఈఓ రాహుల్ తుకారామ్ పాండ్వే

రాయచూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రక్తహీనత, పౌష్టికాహారలోపం నివారణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారామ్ పాండ్వే కోరారు. తాలూకాలోని చిక్కసుగూరు గ్రామంలో మహిళలు, గర్భిణులకు అంగన్‌వాడీల ద్వారా అందే పౌష్టికాహార వివరాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. బుధవారం తాలూకాలోని వివిధ గ్రామాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. గ్రామంలోని రచ్చబండా వద్ద ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ పౌష్టికాహార వివరాల నోట్ బుక్‌లను ఆయన పరిశీలించారు. అనంతనం యరగేరా పరిధిలోని అటవీ ప్రాంతం గ్రామాలను పరిశీలించారు. బిజనగేరా గ్రామంలో గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పాఠశాల ప్రహరీ పనులను సీఈఓ పరిశీలించారు. బిజనగేరా గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా పాఠశాలకు అందుతున్న నీటి సరఫరా గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా అధికారులు జాగ్రతలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో లబ్ధిదారులుగా ఎంపికైన వారు తమకు అందిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాట పట్టాలని సూచించారు.



చిక్కసుగూరు గ్రామంలో వివరాలు సేకరిస్తున్న జడ్పీ సీఈఓ

రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు చేయూత



ఒప్పందం చేసుకుంటున్న ఇరుసంస్థల ప్రతినిధులు

బెంగళూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో కాలుష్యం అధికమైందని, దానిని నివారించే దిశగా సౌర విద్యుత్ వాడకం పర్యావరణానికి అనుకూలం కానుందని ఫెడరల్ బ్యాంకు ఈడీ శాలిని వారియర్ అన్నారు. ఫెడరల్ బ్యాంకు, ఎకోఫై సహభాగత్వంతో రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునేవారికి అనుకూలం కాగలదన్నారు. ఫెడరల్‌బ్యాంకుతో ఒప్పందం ద్వారా ఏటా 3,600 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ స్థాపనకు రుణసదుపాయం ఇచ్చే లక్ష్యం ఉందన్నారు. ఇది ఎంఎస్ఎంఈలకు అనుకూలం కానుందన్నారు. ఎకోఫై కో-ఫౌండర్, ఎండీ సీఈఓ రాజశ్రీ నంబియార్, కో-లెండింగ్ పార్ట్‌నర్‌షిప్ హెడ్ కైలాశ్ రాతి, ఫెడరల్‌బ్యాంకు ఎండీ సీఈఓ కేవీఎస్ మణియన్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

● దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్




శాసనసభ సమావేశంలో మాట్లాడుతున్న దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్

రాయచూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న రాయచూరు జిల్లాపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ అన్నారు. బెళగావిలో జరుగుతున్న శాసనసభ శీతాకాల సమావేశాల సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడారు. విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్ర అవసరాలకు సరిపడ 40 శాతం ఉత్పత్తిని రాయచూరు జిల్లా అందిస్తున్నట్టు తెలిపారు. అదే సమయంలో పలు సహజ వనరులు బంగారు గనులున్న జిల్లా అభివృద్ధి విషయంలో వెనకబడి ఉండడం శోచనీయమన్నారు. ఈ ప్రాంత ప్రజలు సరైన వైద్య చికిత్సలు అందక హైదరాబాద్, బెంగళూరు, బళ్ళారి వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్నా ప్రభుత్వాల నుంచి స్పందన లేకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అండగా నిలవాలని కోరారు.

వివాహేతర బంధం.. ఇద్దరు ఆత్మహత్య

» మండ్య జిల్లా మద్దూరు తాలూకాలో ఘటన



సృష్టి, ప్రసన్న(ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దల సూచనతో ఎవరికి వారుగా పెళ్లి చేసుకున్నారు. అయినా వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగింది. ఈ విషయం వారి కుటుంబాలలో తెలియడంతో భయపడి చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొంతకాలంగా సృష్టి (20), ప్రసన్న (25) ప్రేమించుకున్నారు. ప్రసన్న చివరకు సృష్టి స్నేహితురాలు స్పందనను పెళ్లి చేసుకున్నాడు. కె.బెళ్ళూరు గ్రామానికి చెందిన సృష్టికి ఆతగూరు హోబళి యరగనహళ్ళికి చెందిన దినేశ్‌తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య కుటుంబ సమస్యలతో నాలుగైదుసార్లు తీవ్ర గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో సృష్టి, బన్నహళ్ళికి చెందిన ప్రసన్నతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు తెలుస్తోంది. విషయం ఇరు కుటుంబాల వారికి తెలియడంతో భయపడ్డారు. ఈ నేపథ్యంలో సృష్టి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కనిపించడం లేదంటూ భర్త దినేశ్ స్థానిక కెస్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సృష్టి శింషా నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతదేహం మద్దూరు తాలూకాలోని వైద్యనాథపుర గ్రామ శివారులో కుళ్లిన స్థితిలో సోమవారం సాయంత్రం లభించింది. సృష్టి మృతిచెందిందనే సమాచారం తెలుసుకున్న ప్రసన్న భయపడి బన్నహళ్ళిలోని తన ఇంట్లో ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్దూరు పోలీసులు ఇరువురి కుటుంబీకుల ఫిర్యాదులు స్వీకరించి, దర్యాప్తు చేపట్టారు. సృష్టి మృతదేహానికి మండ్య జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మద్దూరు ఆసుపత్రిలో ప్రసన్న మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ వర్కర్ల ఆందోళన

రాయచూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కర్ణాటక గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాధికారి కార్యాలయం వద్ద ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగా వేతన పెంపు జరపాలని ఉద్యోగులను పర్మినెంట్ వర్కర్లుగా గుర్తించి వారికి పీఆర్‌సీ అమలు చేయాలని కోరారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుపై నగరసభ ప్రచారం

చింతామణి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే రోడ్డు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై స్వచ్ఛందంగా తొలగించాలని నగరసభ అధికారులు ఆటోలో మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు. పట్టణంలోని ఎంజీ రోడ్డు, బెంగళూరు డబుల్ రోడ్డు, పాలిటెక్నిక్ రోడ్డు, చేళూరు రోడ్డు, కేఎస్ఆర్టీసీ బస్టాండ్ తదితర మార్గాలలో బుధవారం విస్తృతంగా పర్యటించి అవగాహన కల్పించారు. కమిషనర్ చలపతి ఇప్పటికే ఆదేశించడంతో ఒక బృందం వెంట ఉండి దుకాణాల వద్ద అదనంగా ఉన్న బోర్డులను తొలగించారు. మూడు రోజులు గడువు ఇచ్చినా పలువురు పాటించకపోవడంపై అధికారులు హెచ్చరించారు.



ఆటోలో ప్రచారం చేస్తున్న నగరసభ అధికారులు

సృజనాత్మకతను పెంచుకోవాలి



డిజైన్ షోకేస్ 2024 కార్యక్రమంలో ప్రొ-చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి

బెంగళూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సృజనాత్మకతను పెంచుకోవడం ద్వారా జీవితంలో ఎదిగేందుకు బాటలు వేసుకోవాలని పీఈఎస్ ప్రొ-చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి పిలుపునిచ్చారు. పీఈఎస్ డిజైన్ షోకేస్ 2024 పేరిట మూడు రోజుల కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ వందమందికిపైగా ప్రతిభావంత విద్యార్థులు నాలుగేళ్లుగా వరుసగా తమ సృజనాత్మకత, ఆవిష్కారాలతో ప్రతిభకు మెరుగులు దిద్దుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వారిలో దాగియున్న ప్రతిభను ప్రోత్సహించేలా తల్లిదండ్రులు చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే సవాళ్లను ఎదుర్కొనే స్థైర్యం పెరుగుతుందన్నారు. డిజైన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ చిత్రా విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల సహకారం మరువరానిదని ప్రశంసించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు వారి ప్రతిభ నిదర్శనంగా ఉన్నాయన్నారు. ఫైనలియర్ విద్యార్థి ఆదిత్య మురళీధర్ మాట్లాడుతూ.. పీఈఎస్‌లో నాలుగేళ్లలో ఎంతో నేర్చుకున్నానని, ప్రతి ప్రాజెక్టులో కొత్తదనం కోసం ప్రోత్సాహం చాలా సంతోషంగా ఉందని, ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. ఆయారంగాలలో సాధనలకు ఇది ఎంతో ఉత్తేజపూరితంగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.



సదా మీ సేవలో
అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ 95909 81234
ACO బెంగళూరు సౌత్ 77951 55585
SR బెంగళూరు ఈస్ట్ 88616 94202
SR బెంగళూరు నార్త్ వెస్ట్ 99009 22004
SR హొసూరు 86818 81386
ACO - బళ్ళారి 95027 41328
ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెబితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు
ఇట్లు: జనరల్ మేనేజర్



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.18	1,591.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3.122	262
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,961	1,470
నీటి నిల్వ (టీఎంసీలు)	91.01	11.77

వినాయకుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

కంప్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగావతి రోడ్డులో జోగి కాలువ వద్దనున్న వరసిద్ధి వినాయకుడికి సంకష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, రుద్రాభిషేకం, బిల్వార్చన, గరికతో ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి వినాయకుడికి పూలు, పండ్లతో, కొబ్బరికాయలతో మొక్కులు సమర్పించుకున్నారు. ప్రతి నెలా సంకష్ట సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పురోహితుడు జడేష్ తెలిపారు.

విరూపాక్షేశ్వర స్వామికి ఫలపూజ



దీపాల వెలుగులో విరూపాక్షేశ్వర ఆలయం

బళ్లారి సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హంపిలో విరూపాక్షేశ్వర స్వామికి ఫలపూజ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీ విద్యారణ్య భారతి స్వామి వారు విరుపాక్షుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం విరూపాక్షేశ్వరస్వామి, పంపాదేవి ఉత్సవమూర్తిని భక్తిశ్రద్ధలతో తుంగభద్ర నది ఒడ్డున ఉన్న చక్ర తీర్థ కోదండరామ స్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలతో ఫలపూజ మహోత్సవం(నిశ్చితార్థం) నిర్వహించారు. చలిలో శివపార్వతుల నిశ్చితార్థాన్ని వేలాది మంది భక్తులు తిలకించారు. పొరుగున ఉన్న ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కేరళ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఫలపూజ మహోత్సవం సందర్భంగా అంతకు ముందు విరూపాక్షేశ్వర ఆలయ ప్రాంతంలో వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణం దీపాలతో నిండిపోయింది.

వీరాపురం సొసైటీ అధ్యక్షుడిగా భోగారెడ్డి



అధ్యక్షుడు భోగారెడ్డి

బళ్లారిరూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని వీరాపురం గ్రామంలో బుధవారం సొసైటీ ఎన్నికలను ఎన్నికల అధికారి ప్రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్ష,ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భోగారెడ్డి, ఉపాధ్యక్షులుగా వీరూపాక్షి గౌడలను ఎన్నుకున్నారు. సభ్యులు వీరారెడ్డి, వీరయ్య, ఎర్ర న్న, ఇందు, శంకర్ గౌడ, తిమ్మయ్య, సుభద్రమ్మ, ఎం లక్ష్మీ, మహబూబ్, వెంకటరమణ, ఈరన్న పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

పామిడి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సొరకాయలపేట గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అంజనేయులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. సొరకాయలపేట అంజనేయులుకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఇటీవల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పించారు. పనులు చేయకపోయినా మస్టర్‌లలో పేర్లు నమోదు చేయాలని కొందరు అతనిపై ఒత్తిడి చేశారు. అలా చేస్తే సోషల్ ఆడిట్‌లో తనకు ఇబ్బందులు ఎదురవుతాయని అంజనేయులు అంగీకరించలేదు. దీంతో అతన్ని తొలగించాలని కొందరు నాయకులు పట్టుబట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం రూ.లక్షకు పైగానే ఖర్చు చేశామని, తొలగిస్తే నష్టపోతానని, అవమానంగా ఉందని తన ఇంట్లోనే మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే పామిడి ఆసుపత్రికి తరలించారు. ఆ తరువాత మెరుగైన చికిత్సకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అంజనేయులు పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని బాధితుని భార్య సుభద్ర అధికారలకు విన్నవించారు.

గ్రామీణ ప్రాంతాల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

● పాలనాధికారి మల్లికార్జున



మాట్లాడుతున్న పాలనాధికారి మల్లికార్జున, టీపీ బసప్ప

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తాలూకా పంచాయతీ పాలనాధికారి మల్లికార్జున పీడీఓలకు సూచించారు. తాలూకా పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన సామాన్య సమావేశంలో ఆయన పాల్గొని ఆయా ప్రభుత్వ శాఖల ప్రగతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడడంలో పీడీఓలు, సభ్యుల సహకారంతో అవసరమన్నారు. అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా సీడీపీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. చిన్నారులకు కోడిగుడ్డు, ఇతర పోషక పదార్థాలను అందించడంలో అంగనవాడీ కార్యకర్తలు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తన దృష్టివచ్చాయన్నారు. అనంతరం విద్యాశాఖ పనితీరుపై పాలనాధికారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయని, ఉపాధ్యాయులు మరింత కృషిచేసి రాష్ట్ర స్థాయిలో బళ్ళారిని ముందు వరసలో నిలిపేలా కృషి చేయాలన్నారు. ప్రధానంగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అదనపు క్లాసులు నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. ఉద్యాన వన శాఖ అధికారి మాట్లాడుతూ ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన విషయ పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్లు, సోలార్ పంపుసెట్లుకు డిమాండ్ ఉందని, అందుకు తగ్గట్టుగా పంపుసెట్ల ప్రభుత్వం నుంచి రావడం లేదన్నారు. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం పేదలకు అందుబాటులో ఉండేలా తాలూకా వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే మహిళలకు మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలని సూచించారు. పశువైద్య సమస్యలపై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు తరచూ సోకే నీలి నాలుక వ్యాధులు వ్యాపించకుండా అవసరమైన టీకాలు వేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాద స్థలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, జెస్కాం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాలూకా స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని ఆయాశాఖల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో టీపీ పాలనాధికారి మల్లికార్జున, తాలూకా పంచాయతీ ఈఓ బసప్ప, గ్యారెంటీ స్కీమ్ అధ్యక్షులు ఎం. నాగభూషణ పాల్గొన్నారు.

సిరిధాన్యాలతో ఆరోగ్యం: జిల్లా సహాయాధికారి



వృద్ధ మహిళతో కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న జిల్లా సహాయాధికారి మహ్మద్ ఎన్.జుబేర్

బళ్లారి గాంధీనగర్/సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సిరిధాన్యాల్లో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, దీంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా సహాయాధికారి మహ్మద్ ఎన్. జుబేర్ అన్నారు. నగరంలోని వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సిరిధాన్యాలు, సేంద్రియ అంతర్జాతీయ వాణిజ్య మేళా-2025 కార్యక్రమంలో జిల్లాస్థాయి సిరిధాన్యాలు తయారు చేసే వంటకాల పోటీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఆధునిక పోకడలతో పాటు ఆహారపు అలవాట్లు కూడా మారాయని, దీంతో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సిరిధాన్యాలతో తిను బండారాలు తయారీని ఎక్కువగా ప్రోత్సహించాలని అన్నారు. సజ్జ, జొన్న, రాగి, కొర్రలు తదితర వాటితో తయారుచేసిన ఆహార పదార్థాలను తినడం వల్ల ఆరోగ్యానికి మంచిదన్నారు. ఈ ఆహార పదార్థాల లాభం, ఉపయుక్తం గురించి ఎక్కువగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. విదేశీ ఆహార పదార్థాలైన పిజ్జా, బర్గర్ నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి హాని చేస్తాయన్నారు. వంటల పోటీ కార్యక్రమంలో సిరిధాన్యం పదార్థాలతో స్థిమితం కారాదని, ఇళ్లలో ప్రతి రోజూ వీటితో వివిధ రకాల వంటలు తయారుచేసి పిల్లలకు ఇవ్వాలని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సోమసుందర్, అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథ్, ఎస్.కెంగేగౌడ, హగరి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు శిల్పా, రాజేశ్వరి, బళ్ళారితాలూకా అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.దయానందలతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన దీక్ష



నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

బళ్లారి సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని స్థానిక డీసీ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష బుధవారం రెండో రోజూ కొనసాగింది. సీఐటీకి అనుబంధంగా ఉన్న కర్ణాటక రాష్ట్ర అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సంఘం నాయకులు జే.సత్యబాబు, ఉమాదేవి మాట్లాడుతూ 2018 నుంచి కేంద్ర ప్రభుత్వం గ్రాట్యుటీని పెంచలేదన్నారు. గ్రాట్యుటీని రూ.26 వేలకు పెంచాలని 2023 విధానసభ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన విధంగా గౌరవ వేతనం రూ.15వేలకు పెంచాలన్నారు. పదవీ విరమణ పొందిన వారికి ఎన్.పీ.ఎస్ రూ.10వేలు నెలవారీ పింఛనుగా ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభించాలన్నారు. సామాజిక ఆరోగ్య బీమా వెంటనే అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే అనుబంధ పోషకాహారానికి జీఎస్టీ, యూనిట్ ధరను పెంచవద్దని,జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గతంలో మాదిరిగానే మెనూ ఖరారు విధానాన్ని అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. మూడు నెలల్లో ఖాళీలను భర్తీ చేయాలని, లేనిపక్షంలో ఓవర్ టైమ్ వేతనం చెల్లించాలన్నారు. హెల్పర్ లేని అంగన్ వాడీ కేంద్రాల్లో టేక్ హోమ్ ఇవ్వాలని, హెల్పర్‌ను నియమించుకునే అధికారం హక్కు వర్కర్‌కు ఇవ్వాలన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక సహాయకుడిని పూర్తిస్థాయి కేంద్రాలుగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని లష్కర్ల ఆందోళన

● సొమ్మసిల్లి పడిపోయిన లష్కర్



నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న లష్కర్లు

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ పరిధిలో హెచ్చెల్సీ, ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కాలువల కింద పనుచేస్తున్న లష్కర్లకు వేతనాలు చెల్లించాలంటూ వందలాది మంది ఆందోళన చేపట్టారు. బుధవారం కోట ప్రాంతంలోని జిల్లా నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు లేకపోతే పూటగడవడం కష్టంగా మారిందని, సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి మా జీవితాలతో ఆడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్లతరబడి నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న లష్కర్లను పర్మినెంట్ చేయకుండా పనిదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించకపోగా, పీఎఫ్ చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు



సొమ్మసిల్లి పోయిన లష్కర్

పీఎఫ్ చెల్లించకుండానే అధికారులు సదరు కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లిస్తున్నట్లు ఆరోపించారు. రాత్రి వేళల్లో డిస్ట్రిబ్యూటరీ కాలువల వద్ద పనిచేయలేకపోతున్నట్లు, నిబంధనల ప్రకారం లష్కర్లకు అవసరమైన బూట్లు, టార్చ్‌లైట్లు, ఇతరత్ర సామగ్రి కాంట్రాక్టరు అందజేయాలని నిబంధనలు ఉన్నా.. అధికారులు ఇవేమి పట్టించుకోవం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెండరు గడువు పూర్తి కాగా 2024-2025 సంవత్సరానికి కొత్తగా టెండరు పూర్తి అయిందని, అయితే లష్కర్ల కాంట్రాక్టు పొందిన టెండరుదారుడు ఫైనల్ సెటిల్‌మెంట్ చేయకుండా కొత్తవారికి అనుమతి ఎలా ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం ముందు ఆందోళన చేపట్టినా.. సంబంధిత అధికారులు ఎవరూ తమ గోడు వినలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో నీరసించిన ఓ లష్కర్ కింద పడిపోవడంతో వెంటనే 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు.

పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలను

మంజూరు చేయండి

● శాసనసభలో ఎమ్మెల్యే అన్నపూర్ణ



బళ్లారి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు నియోజకవర్గం తోరణగల్లులో ప్రభుత్వ పాలిటెక్నిక్, సండూరులో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అన్నపూర్ణ కోరారు. బెళగావిలో జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో ఆమె బుధవారం తన ప్రశోత్తరాల సమయంలో మాట్లాడారు. సండూరు ప్రాంతంలో ఇనుము, పెయింట్, మైనింగ్ ఇలా అనేక రకాల కంపెనీలు ఉన్నాయన్నారు. ఇక్కడ ఈ కళాశాలలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అన్నారు. సండూరులో 100 పడకల ఆసుపత్రి నుంచి 200 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బళ్లారిలో మిర్చి మార్కెట్ ఏర్పాటు చేయండి

● విధానసభలో బీజేపీ ఎమ్మెల్సీ వైఎం సతీష్



బళ్లారి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో ఎండుమిర్చి మార్కెట్ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని విధానసభలో బీజేపీ ఎమ్మెల్సీ వైఎం సతీష్ కోరారు. శాసనమండలిలో 951 అంశంపై సతీష్ బాబు మాట్లాడారు. బళ్లారిలో మిరప ఏపీఎంసీకి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అలదల్లి వద్ద మార్కెట్ యార్డు నిర్మాణం చేయాలని నిర్ణయించారన్నారు. కానీ ఇక్కడ నిర్మాణానికి పీపీపీ పద్ధతి ద్వారా ప్రభుత్వ టెండర్ పిలిచినట్లు తెలిపారు. కానీ పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేట్ ప్రాజెక్టు (పీ.పీ.పీ) పద్ధతిలో జరిగే ఈ నిర్మాణానికిఎవరూ ముందుకు రాలేదన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా బళ్లారిలో ప్రస్తుతం ఉండే ఏపీఎంసీ మార్కెట్‌లో కొంత స్థలం కేటాయించి అక్కడే ఎండుమిర్చి మార్కెట్‌ను నడపాలని సతీష్ కోరారు. ఈ ప్రశ్నకు వ్యవసాయశాఖ మంత్రి శివానంద పాటిల్ బదులిస్తూ బళ్లారిలో ఎండుమిర్చి మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర (బ.రా.కొ.వి.) పరిధిలో ఉన్న పాల ఒక్కూట సంఘం ఎన్నికల గడువు ముగిసినా ఇంత వరకూ ఎందుకు ఎన్నికలు జరపలేదని వై.ఎం. సతీష్ ప్రశ్నించారు. సంఘం ఎన్నికలు జరపలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకు ముందు ఈ నాలుగు జిల్లాల్లో మెగా డైరీ నిర్వహణకు రూ.80 కోట్లు నిధులు ప్రకటించారు. ఇందుకు 15 ఎకరాల భూమిలో కొళగల్లు వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు ఒక్కూట సంఘం అధ్యక్ష ఎన్నికలు జరపని కారణంగా ఈ పనులు నిలిచిపోయాయన్నారు. దీనిపై పాల ఉత్పత్తి శాఖ మంత్రి బదులిస్తూ గతంలో బెంగళూరు పాల ఉత్పత్తి సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు.

గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలి



గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మొదటిసారి గర్భందాల్చిన వారు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమంతప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. బుధవారం బళ్లారి తాలూకా వైకగ్గల్ గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గర్భిణుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో కూతురు, కోడలు గర్భిణి అని తెలిసిన రోజు నుంచి డాక్టర్ వద్ద పరీక్షలు, వైద్యం చేయించుకోవాలన్నారు. గర్భిణుల ఆరోగ్యం, భద్రతకు పెద్దపీట వేయాలన్నారు. మొదటి ప్రసవం శస్త్రచికిత్స ద్వారా అయితే తిరిగి గర్భం దాల్చేందుకు కనీసం 3 సంవత్సరాలు వాయిదా వేయాలన్నారు. దీని కోసం మనం ఇంట్రా-ఇంజక్షన్, కాపర్-టి, నిరోధ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మరీ ముఖ్యంగా గర్భిణిని ఉన్నతస్థాయి ఆసుపత్రికి తరలించే సమయంలో 108 హెల్త్ కవర్ రావడంలో జాప్యం జరిగే అవకాశం ఉంటే వెంటనే వైద్యాధికారులు ప్రత్యామ్నాయ రవాణాఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప మాట్లాడుతూ పండుగలు, జాతరలు, ఊరిదేవుని ఉత్సవాల్లో గర్భిణులకు సకాలంలో పరీక్షలు అందేవిధంగా తల్లిదండ్రులు ప్రాధాన్యతనివ్వాలన్నారు. వైద్యాధికారులు తమ సిబ్బందికి, ఆశా వర్కర్లకు గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని ప్రతి వారం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కావశ్రీ, జీఎన్‌ఓ గిరీష్, చంద్రకళ, మోనికా, భద్రతాధికారి నాగమ్మ, ఆశావర్కర్లు సిద్ధమ్మ, రేణుక, కస్తూరి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి



కేంద్ర మంత్రి కుమారస్వామికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ తుకారామ్

కంప్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుడితిని పరిధిలో కర్మాగారాల కోసం భూములు పోగొట్టుకున్న రైతులకు న్యాయంచేయాలని బళ్లారి ఎంపీ ఈ తుకారామ్ కుమారస్వామికి మనవిపత్రం సమర్పించారు. కొన్ని రోజులుగా కుడితిని పట్టణంలో న్యాయ పోరాటం కోసం పగలు, రాత్రి, వర్షం, గాలి లెక్కచేయకుండా నిరసనలు చేపడుతున్నారన్నారు. వెంటనే వారి కష్టాలను దృష్టిలో వుంచుకుని న్యాయం చేయాలని కోరారు. కేంద్రమంత్రి కుమారస్వామి స్పందిస్తూ ఈ విషయంపై చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిరుగుప్ప, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలుకా కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన క్యాలెండర్‌ను ఆ సంఘం గౌరవాధ్యక్షుడు కొల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం బళ్లారి రోడ్డు మార్గంలో ఉన్న కమ్మవారి భవనంలో క్యాలెండర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 2025లో పుష్కలంగా వర్షాలు కురిసి, సమృద్ధిగా పంటలు పండి అందరూ సుఖసంతోషాలతో వుండాలని ఆకాంక్షించారు. సంఘం అధ్యక్షుడు జలాది రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు తాతినేని ప్రసాద్, కార్యదర్శి పోతుగుంట సత్యనారాయణ, కోశాధికారి గొట్టిపాటి చౌదరి, డైరెక్టర్లు మిక్కిలినేని ప్రసాద్, డీ సత్యనారాయణ, బసవరావు, శివ వెంచురావు, ఖాజా సురేష్, వై సత్యనారాయణ, నర్రా మురళి, మేక శ్రీనివాసరావు, దొరబాబు, కన్వీనర్ రఘుకిరణ్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమ్మ సంఘం నాయకులు

హోసూరు జోన్

సహకార దుకాణం ప్రారంభం



దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

హోసూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హోసూరు ఆవలపల్లి హడ్కో ప్రాంతంలో కెలమంగలం వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో చిల్లర దుకాణాన్ని ప్రారంభించారు. ఇక్కడ కూరగాయలు కూడా అందుబాటులో ఉంటాయి. సీఎం ఆదేశాల మేరకు రిటైల్ కూరగాయల దుకాణం ప్రజలకు సులభంగా చేరేలా మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే ఉత్పత్తులను అందించేలా వీలు కల్పించారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్ లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, పబ్లిక్ హెల్త్ కమిటీ ఛైర్మెన్ మాదేశ్వరన్, టాక్స్ కమిటీ ఛైర్మెన్ చెన్నీరప్ప, మండల అధ్యక్షుడు రవి, నగర డీఎంకే కార్యనిర్వాహకులు సెందిల్ కుమార్, గోపాలకృష్ణన్, కౌన్సిలర్ చెన్నీరప్ప, ఇన్వేంటరీ డిప్యూటీ రిజిస్ట్రార్ కార్తికేయ, సెక్రటరీ అన్బళగన్, జనరల్ మేనేజర్ వేలు, కో-ఆపరేటివ్‌కు చెందిన భానుమతి తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు రూ.100 కోట్లు

● వసూళ్లకు అదనపు సిబ్బంది అవసరం
● స్థాయీ సమితి అధ్యక్షుడు చెన్నీరప్ప



మాట్లాడుతున్న పన్నుల స్థాయి సమితి అధ్యక్షుడు చెన్నీరప్ప, కమిషనర్ శ్రీకాంత్

హోసూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలో పన్నులు వసూలు చేసేందుకు పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది లేకపోవడంతో రూ.100 కోట్ల పన్ను బకాయి ఉందని పన్నుల స్థాయి సమితి అధ్యక్షుడు చెన్నీరప్ప వెల్లడించారు. బుధవారం స్థాయి సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి హోసూరు మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చెన్నీరప్ప మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు అవసరమయ్యేలా తగినంత సిబ్బంది, అధికారులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఇళ్లు, దుకాణాలు, ఫ్యాక్టరీల నుంచి పన్నుల బకాయి ఉందన్నారు. బాడుగ ఇళ్లలో అధికశాతం కూలీలే ఉన్నారని ఇలా ఐదారేళ్లుగా ఇంటి పన్ను వసూలు కాలేదన్నారు. ఈ తరుణంలో 2024-25 సంవత్సరానికి మాత్రమే పన్ను వసూలు చేయాలని తీర్మానించామన్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్థలాలపై పన్ను విధించరాదని, భవనాలపై పన్ను విధించే సమయంలో మెట్లు, పోర్టికో తదితరాలపై పన్ను విధించకూడదు, వాస్తవ వినియోగంలో ఉన్న ప్రాంతానికి మాత్రమే పన్ను విధించాలన్నారు. ఒకే భవనంలో ఉన్న అద్దె ఇళ్లకు ఏకీకృతం చేయాలని, ఒకే పన్ను అంచనా సంఖ్యను కేటాయించాలన్నారు. కార్పొరేషన్‌కు సంబంధించిన అన్ని విభాగాల్లో మూడు నెలలకోసారి వార్డుల వారీగా గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల సమస్యలను ఆలకించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా పన్ను చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పన్ను వసూళ్లకు వచ్చే అధికారులతో ప్రజలు గొడవపడకుండా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంకే కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ పన్ను చెల్లింపునకు దరఖాస్తు చేసుకుంటే పన్నుల వసూళ్ల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి అసిస్టెంట్ కమీషనర్ లేదా కమీషనర్‌కు ఫిర్యాదు చేయాలని బదులిచ్చారు. దీనికి కౌన్సిలర్ నాగరాజు వరుసగా ఫిర్యాదు చేయడమే తమ పని అంటూ ఆక్రోశం వ్యక్తం చేసి సమావేశం నుంచి నిష్క్రమించారు. అనంతరం అసిస్టెంట్ కమీషనర్ టిటో మాట్లాడుతూ ఇకపై ఫిర్యాదు చేస్తే పన్ను వసూలు అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాల వేలం.. రూ.15 లక్షల ఆదాయం

హోసూరు(క్రైం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హోసూరులో వివిధ కేసులలో సీజ్ చేసిన 88 వాహనాలను ప్రొహిబిషన్ పోలీసులు వేలం వేశారు. అక్రమ మద్యం నియంత్రణా విభాగం నిర్వహించిన తనిఖీలలో సీజ్ చేసిన వాహనాలను కోర్టు ఆదేశాల మేరకు వేలం వేశారు. హోసూరు పోలీసు ఎస్పీ క్యాంపు కార్యాలయం ఆవరణలో ఏటీఎస్‌పీ శంకర్, ప్రొహిబిషన్ డివిజన్ డీఎస్పీ సిందు ఇతర పోలీసు అధికారుల సమక్షంలో వేలం నిర్వహించారు. నాలుగు చక్రాల భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు సహా మొత్తం 170 వాహనాలను జప్తు చేసి వాటి విలువను ఆయా వాహనాలకు నిర్ణయించారు. వీటిలో 74 ద్విచక్ర, 14 నాలుగు చక్రాల వాహనాలు మొత్తం 88 వాహనాల వేలం వేయగా రూ.15.20 లక్షల ఆదాయం లభించింది.

నిందితుడిపై రౌడీషీట్

హోసూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ తాలూకా కార్యాలయం రోడ్డు కోర్టు ఆవరణలో న్యాయవాదిపై హత్యాయత్నం కేసులో నిందితుడు ఆనంద్‌కుమార్‌పై రౌడీషీట్ నమోదు చేశారు. వివరాలిలా.. నవంబరు 20న నామల్‌పేటకు చెందిన న్యాయవాది కణ్ణన్ (30)పై దాడి చేయడంతో తీవ్ర గాయాలైన అతడిని ఆసుపత్రిలో చేర్పించారు. అత్యవసర విభాగంలో చేరిన కణ్ణన్‌కు ఆపరేషన్లు నిర్వహించగా గత 29 రోజులుగా చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో హతమార్చేందుకు యత్నించిన మరో న్యాయవాది వద్ద గుమాస్తాగా పని చేస్తున్న ఆనందకుమార్ అదే రోజుకోర్టులో లొంగిపోయాడు. అతడిని హోసూరు టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.